
మైదుకూరు చరిత్ర

తవ్వా ఓబుల్ రెడ్డి వ్యాసాలు



మైదుకూరు శాసనం

మైదుకూరు శాసనం :- క్రీ.శ. 1259

కాకతీయ రాజు గణపతిదేవుని అగ్రసేనాపతి అయిన గంగయ సాహిని రాజ్యపాలన చేస్తూ ఉండగా, అతని మేనల్లుడు జన్మిగదేవుడు మైతకూరు గంగరాజుగారి పట్టణంలో కొన్ని వృత్తులను బ్రహ్మణులకు శోత్రియంగా ఇచ్చినట్లు కీ.శ. 1259 నాటి మైదుకూరు శాసనం తెలుపుతోంది. కాంచీపుర రాజు సిద్దయ్యదేవ మహారాజు సోమశిలవద్ద జరిగిన యుద్ధంలో మరణించినట్లు, ఆ సందర్భంగా కీ.శ. 1261 నాటి 'అన్నలూరు' జయస్థంభ శాసనంలో ఉన్నట్లు గండికోట కైఫియత్తు ద్వారా తెలుస్తోంది. మద్దెల వారి సంస్థానమే మైదుకూరు అని కొన్ని ఆధారాల వల్ల తెలుస్తోంది.



-తవ్వా ఓబుల్‌రెడ్డి

సోమిరెడ్డి పల్లె శాసనం:

జ్యోతిరాజు గుండయదేవ మహారాజునకు "పాండ్యరాయగజకేసరి" అనే బిరుదున్నట్లు (స్పష్టంగా లేని) సోమిరెడ్డిపల్లె శాసనం ద్వారా తెలుస్తోంది.

శా.శ॥ 1491 (1569క్రీ.శ) శుక్ల నామసం॥ బహుళ ఏకాదశి వనిపెంట శాసనం:

వెంకటయ్య అతని తమ్ముడు అప్పయ్య అనే వ్యక్తులు ఏకస్థులై తమ తండ్రి నుండి వారసత్వంగా సంక్రమించిన ఒక గ్రామాన్ని పేరు చెరిగి పోయింది తమ అవసరనిమిత్తం వనిపెంట చెన్నకేశవస్వామికి నూటా డెబ్బై వరహాలకు అమ్మినట్లు చెప్పబడింది. ఈ అమ్మకం "తత్కాలోచిక మధ్యస్థ పరికల్పిత (లక్షణా) లక్షిత ఉభయ వాది ప్రతిసంపన్నమని చెప్పబడింది.

తుడుమలదిన్నె చిజికట్ల శిలాశాసం:

మహామండలేశ్వర రాజుకు తురిమిళ్ళ దిన్నె కాపులకు చితికట్ల శిలాసనాన్ని ఇచ్చినట్లు తుడుమల దిన్నెలోని కాలనిర్ణయం లేని ఒక శాసనంలో పేర్కొనబడింది. 'చిజికట్ల' అంటే అర్ధం తెలియదు. తురిమిళ్ళదిన్నె లోని కాపులకు ఒక తూము భూమి చేసుకున్నదానికి పాతిక గద్యాణం లెక్కన ఇచ్చేట్లు కుదుర్చు కున్న విషయం పై శాసనంలో చెప్పబడింది.

మిడుతూరు శాసనం:

రేనాటి చోళులలో చివరివాడు జటాచోడమహారాజు. ఇతని రాజ్యపాలనకు సంబంధించినదే మితుతూరు శాసనం. 'హరిదుర్ధరవర' ప్రశస్తితో ప్రారంభమైంది కలురేడు కయ్యం జరుగుతున్న సందర్భంలో జటాచోడుడు, రాచమానంలో 80 మరుతుర్ల నేలను ఇచ్చినట్లు పై శాసనంలో చెప్పబడింది.

సాయినాధపురం ఇలా ఏర్పడింది !

మైదుకూరులోని షిరిడిసాయిబాబా మొదటి (పాత)మందిరం 1956వ సం॥న వెలసింది. ఈ సాయిబాబా మందిరం నిర్మాణంతోనే మైదుకూరులోని సాయినాథపురం అవతరించింది. స్థానిక కడపరోడ్డులోని జిల్లాపరిషత్ హైస్కూల్ హద్దుగా కడప దిశగా సాయినాథపురం విస్తరించి ఉంది.

ఈ సాయిబాబా మందిర నిర్మాణం వెనుక శ్రీయోగానంద కృష్ణారావు అనే భక్తుడి కృషి ఎంతగానో ఉంది. తమిళనాడులోని తిరుచిరాపల్లికి చెందిన కృష్ణారావు చిన్న తనంలోనే తన అన్నగారికి దండనతో ఇల్లు విడిచి వచ్చి కడప చేరాడు. కడపలోని వన్‌టవున్‌లో ప్రముఖంగా విలసిల్లిన 'మణి' హోటల్‌లో కృష్ణా రావు పనిచేస్తూ ఉండేవారు. మణిహోటల్ యజమానికి బంధులైన మైదుకూరుకు చెందిన మైదుకూరులో నరసింహయ్య హోటల్ నడిపేవారు. కృష్ణారావు మైదుకూరికి వచ్చి నరసింహయ్యహోటల్ క్యాషియర్‌గా పనిచేస్తూ, ఆధ్యాత్మిక భావనను కూడా పెంపొందించు కున్నారు. మూడు సార్లు షిరిడీకి వెళ్ళి వచ్చారు. షిరిడీలో అబ్దుల్లా బాబా కృపకు పాత్రుడయ్యాడు. అబ్దుల్లా బాబా కృష్ణారావును చేరదీశాడు.

"మైదుకూరులోని ఈశాన్యభాగంలో వెలసిన ఆశ్రమంలోని స్త్రీ గురువు వద్ద శిష్యరికం పొందుము అని "అబ్దుల్లా బాబా " కృష్ణారావుకు సూచించారు. మైదుకూరులో పిచ్చమాంబ మఠం, కార్యక్రమాల్లో పాల్గొంటూనే కృష్ణారావు మైదుకూరులో 1956 సంవత్సరం హోటల్ నరసింహయ్య ప్రోత్సాహంతో సాయిబాబా గుడి నిర్మాణం చేపట్టారు. గ్రామస్థుల సహకారంతో సాయిబాబా గుడి నిర్మాణం పూర్తి అయింది. సాయినాధుని గుడి కారణంగానే ఆ గుడి వెలసిన పురానికి "సాయినాథపురం "అని పేరు వచ్చింది.



మన చరిత్ర తెలుసుకుందాం !


- మిట్టమానుపల్లె అసలుపేరు "మిట్టభూమనపల్లె"
- పోతిరెడ్డిపాడు అసలుపేరు "తాతిరెడ్డిపల్లె"
- ముక్కొండకు ఉత్తరంవైపు వనిపెంటవైపున ఉన్న కొండను ఎద్దుల కొండ అంటారు. మరింత ఉత్తరాన "కుమ్మర కొండ " పడమర "పొడితిప్ప " ఉంది.


మద్దెల వారి సంస్థానమే మైదుకూరు.

- వక్కిలేరుకు పూర్వపు పేరు " వల్కలా నది"
- వక్కిలేరు ఉప్పగుంటపల్లెకు తూర్పున బుగ్గగాపుట్టి నంద్యాలంపేట, పుల్లూరు, ఖాజీపేటల మీదుగా వెళ్లి పుష్పగిరి వద్ద పెన్నానదిలో కలుస్తుంది.
- క్రీ. శ. 6వ శతాబ్ది రేనాటి చోళులు పరిపాలించారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, కొయిలకుంట్ల ప్రాంతంలోని 7వేల గ్రామాలున్న మండలమే రేనాడు. రేనాటి చోళులు తమ రాజ్యాన్ని తూర్పున రాజంపేట తాలూకా 'పొత్తపి' నుండి పడమర కర్నాటక రాష్ట్రంలోని నిడిగట్ల వరకు విస్తరించారు.
- పత్తూరు పాళెం స్థాపకులైన ముసలినాయుడు స్వంత సైన్యాన్ని సమీకరించుకుని శ్రీ కృష్ణ దేవరాయలు కాలంలో రాజ్య ధిక్కారం చేశాడు. ఈ తిరుగుబాటుకు అణచడానికి రాయలసైన్యం తరలించడంతో సైన్యాన్ని ఎదుర్కొలేన లేక ముసలినాయుడు లంకమల అడవులలోకి పారిపోయాడు. ఆ తర్వాత శ్రీ కృష్ణదేవరాయలు 'పుష్పగిరి' యాత్ర సందర్భంలో రాయలు సామంతుడైన కామరుసు తిమ్మయ ద్వారా ముసలినాయడు తన లొంగుబాటును ప్రకటించాడు. రాయలు అతనిని క్షమించి పుష్పగిరి, పేర్నపాడు, గ్రామాల మధ్య ఉండే అరణ్యప్రాంతాన్ని అంటే ప్రస్తుత ఖాజీపేట, మైదుకూరు మండలాలలోని కొంతప్రాంతాన్ని ముసలినాయునికి జాగీరుగా ఇచ్చారు.
- నంద్యాల తిమ్మయ్య దేవ మహారాజు ఇంద్రనాథ దేవుని స్థానం గ్రామస్థులైన పత్తూరు, రావులపల్లె, దుంపలగట్టులో మంగల తిమ్మోజి చెల్లించే పన్నును మన్నిస్తూ ఉత్తర్వు చేసినట్లు క్రీ.శ. 1547 నాటి 'పుష్పగిరి' శాసనం తెలుపుతోంది.

గంజికుంట సీమ నాయకుడైన బుక్కరాజు తిమ్మరాజు నుండి మచ్చికంటి కామరాజు కుమారుడు రాయసం గంగరసు వనిపెంట గ్రామాన్ని గుత్తకు తీసుకున్నట్లు క్రీ.శ. 1521 నాటి వనిపెంట శాసనం ద్వారా తెలుస్తోంది. వనిపెంట చెరువు కట్ట శిథిలమై ఉండగా, చెరువు మరమ్మతుకై కూలీలకు ఆ గ్రామస్థులు ఏటా గుత్త చెల్లించాల్సిందిగా ఆదేశించినట్లు శ్రీ కృష్ణదేవరాయల కోసం నాటి ద్వారా తెలుస్తోంది.

- జాండ్లవరాన్ని అగ్రహారంగా ఇచ్చారు.
- చాగలమర్రి సంస్థానాన్ని ఏలుతూ ఉండిన శ్రీ కొండ్రాజు నలదాతా చార్యులు అనే బ్రాహ్మణునికి జాండ్లవరాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. నలదాతాచార్యులు కుమారులు [illegible]య్య, అప్పయ్యలు జాండ్లవరం గ్రామాన్ని వనిపెంట చెన్నకేశవాలయానికి 170 [illegible] అగ్రహారాన్ని విక్రయించి శాలివాహన శకం 1471 (క్రీ.శ. 1549) శుక్ల నామసంవత్సరం [illegible] క్రయపత్ర శిలాశాసనం వేయించారు. ఈ శాసనం వనిపెంట చెన్నరాయుని దేవస్థానంలో
- తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె, పాలెగాళ్ళకు అణచేందుకు మైసూరు మహారాజు టిప్పుసుల్తాన్ ఆధ్వర్యంలో నంద్యాలంపేటకు దక్షిణం వైపున ఒక కోట నిర్మించారు.





'కాశీయాత్రా చరిత్ర'లో ఖాజీపేట-దువ్వూరు

మైదుకూరు ప్రాంతంలోని ఊర్లు, బాటల పరిస్థితిని ప్రఖ్యాత ప్రముఖ యాత్రా సాహిత్యకారుడు ఏనుగుల వీరాస్వామయ్య స్వయంగా యాత్ర జరిపి రచించిన "కాశీయాత్ర చరిత్ర" గ్రంథంలో ప్రస్తావించారు. ఈ గ్రంథం తెలుగుభాషలో వెలువడిన మొదటి యాత్రాచరిత్ర గ్రంథం. వీరాస్వామయ్య 1830 సంవత్సరం మేనెల 18న చెన్నై నుండి తన కాశీ యాత్రను ప్రారంభించాడు. కాశీని దర్శించుకున్న అనంతరం 1831వ సంవత్సరం సెప్టెంబర్ 3న తిరిగి చెన్నపట్నం చేరారు.

వీరాస్వామయ్య చెన్నై నుండి స్త్రీలు, పరివారంతో కలిసి పదిమందితో కూడిన బృందంగా అప్పట్లో కాశీయాత్ర ప్రారంభించడం విశేషం. చెన్నై జమీందారీలో ఉద్యోగి అయిన వీరాస్వామయ్య స్వయంగా తెలుగు భాషలో పండితుడు.

వీరాస్వామయ్య 1830 జూన్ 3వ తేదీ రాత్రి 7 గం॥లకు చెన్నై నుండి కడపకు చేరుకుని, కడపలో నాలుగురోజులు మజిలీ చేశారు. జూన్ 7వ తేదీ ఉదయం 9 గం॥లకు పుష్పగిరి క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పెన్నానదిని దాటిన విషయాన్ని వీరాస్వామయ్య ప్రస్తావించారు. పెన్నానది వాన కురిసినపుడు మాత్రమే వేగంగా ప్రవహిస్తుందనీ, తర్వాత వెంటనే ప్రవాహం నిలిచి పోతుందనీ పేర్కొన్నారు. నది గట్టున వెలసిన పుష్పగిరి దేవస్థానం రమ్యంగా ఉందనీ, హస్తి నిక్షేపం చేయతగిన పుణ్యస్థలమనీ, స్మార్థ పీఠాధిపతి అక్కడ మఠం కట్టుకుని నివాసం చేస్తున్నారనీ, పుష్పగిరిలో అప్పట్లో 18 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవనీ, ఆ బ్రాహ్మణులు వేదాంత విచారణ కలవారని వీరాస్వామయ్య తెలిపారు. అయితే పుష్పగిరిలో ఎలాంటి నిత్యావసర వస్తువులు లభించవని నది దాటి పేటకు పోయి తెచ్చుకోవాలని వివరించారు. అంటే అప్పట్లోనే ఖాజీపేట 'పేట' గా పిలువబడుతూ వ్యాపార కేంద్రంగా ఉండేదని తెలుసుకోవచ్చు. 1930 జూన్ 7వ తేదీ సాయంత్రం వీరాస్వామయ్య పుష్పగిరి నుండి ఖాజీపేటకు చేరుకున్నారు. పుష్పగిరి నుండి ఖాజీపేట బాట సరిగాలేదని, ఖాజీపేటలో వసతిగా ఉంటే ఇండ్లు లేవని, బ్రాహ్మణులున్నారని వీరాస్వామయ్య తెలిపారు. 8వ తేదీ రాత్రి 3గంటలకు ఖాజీపేట నుండి బయలుదేరి ఉదయం 9గంటలకు దువ్వూరుకు చేరారు. ఖాజీపేట, దువ్వూరు గ్రామాల మధ్యలో మైదుకూరు మీదుగా వీరాస్వామయ్య ప్రస్తావించకపోవడాన్ని గమనిస్తే ఖాజీపేట, దువ్వూరు కేంద్రాలే అప్పట్లో పెద్ద కేంద్రాలుగా ఉండేవని భావించొచ్చు.



ఖాజీపేట దువ్వూరుల మధ్య అడవిలేదని, బయలుపొలం లెస్సగా ఉందని పేర్కొన్నారు. దువ్వూరులో కూడా వసతిగా ఉన్న ఇళ్ళు, చావిళ్లు లేవనీ, ఊరు ఇరుకుగా ఉందనీ, అయితే అన్ని వస్తువులు దొరుకుతాయని తెలిపారు. అక్కడినుండి "వంగలి" గ్రామం చేరామని, అక్కడ గొప్ప ఇళ్ళు, చావిళ్ళు ఉన్నాయని, వివరించారు. దువ్వూరు తర్వాత ప్రతి గ్రామంలో కొండ కరముల వాండ్లు (కొండ కమ్మరి వారు) ఉన్నారని, ఇనుపరాళ్ళతో ఇనుము చేయుచున్నారని వీరాస్వామయ్య తెలిపారు. వంగలి గ్రామానికి చారిత్రక ప్రాధాన్యత ఉందని ఈ సందర్భంగా తెలుసుకోవచ్చు. 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు వంగలినుండి బయలుదేరి సాయంత్రంలో అక్కడికి ఒకటిన్నర ఆమడ దూరంలోని అహోబిలం క్షేత్రాన్ని వీరాస్వామయ్య చేరుకున్నారు. పూర్వ కాలంలో రహదారులు, బాటలు పుణ్యక్షేత్రాల మీదుగా ఉండేవని, వీరాస్వామయ్య కూడా పుష్పగిరినుండి అహోబిలం చేరిన విధానాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

శ్రీమదచల పీఠం


భగవద్గీత మార్గదర్శకంగా, ధర్మసంస్థాపన ఆశయంగా నడుస్తున్న అచలపీఠం తనదైన తాత్విక ధోరణిలో వేలాదిమంది గురుపుత్రులతో విస్తరిస్తోంది. చిత్తూరు జిల్లా వడమాలపేటలో సుమారు 150 ఏళ్ళకిందట హజరత్‌బురహనుల్ షా ఖాద్రీ పీఠాధిపతిగా అచలపీఠం ఏర్పాటైంది. తర్వాత నాదమునేంద్రస్వామి ఖాద్రీనుంచి భోధనాధికారాన్ని స్వీకరించారు. నాదమునేంద్ర స్వామి కుమారులైన నంబి వేమనాచార్యులు, నాగూరు స్వామి అచలసిద్దాంత ప్రచార భాధ్యతలు చేపట్టారు. మైదుకూరు మండలం సుంకులుగారిపల్లెలో ఆశ్రమానికి పునాది వేయడం ద్వారా అచలపీఠం ఏర్పాటు చేసిన సాధునారాయణరెడ్డి స్వామి, నంబి వేమనార్యుల వద్ద శిష్యరికం ద్వారా అచల సిద్ధాంతాలపై భోధనాధికారం పొంది సుమారు 50 సంవత్సరాలపాటు చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాలతోపాటు హైదరాబాదులోని గురుపుత్రులకు బోధనలు చేశారు. ముద్దనూరు మండలం ఉప్పలూరు గ్రామంలో అట్లా లింగారెడ్డి, నాగమ్మ దంపతులకు నారాయణరెడ్డి స్వామి జన్మించారు. అనాదిగా కుటుంబంలోవస్తున్న తాత్విక, ఆధ్యాత్మిక వాతావరణంతో ప్రభావితుడైన నారాయణరెడ్డి స్వామి 24 ఏళ్ళ వయస్సులో చిత్తూరులోని వడమాలపేటలో అచలపీఠాధిపతిగా ఉన్న నంబి వేమనార్యు ల శిష్యునిగా చేరారు. అక్కడే 20 ఏళ్ల పాటు తాత్విక అధ్యయనాన్ని కొనసాగించి భోధనాధికారం పొందారు. 50 ఏళ్ళు సిద్ధాంత ప్రచారంలో దేశాటనం చేసి మైదుకూరు మండలం సుంకులుగారిపల్లె లో ఆశ్రమ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. నారాయణరెడ్డి స్వామి బోధనలకు ప్రభావితులైన వెయ్యి మందికి పైగా గురుపుత్రులు అచల పీఠంలో ప్రవేశం పొందారు. గురుపుత్రులలో విశేషమైన తాత్విక దృక్పథాన్ని రేకెత్తించడంలో నారాయణరెడ్డి స్వామి కృషి చేశారు. పరిపూర్ణ సుధానిధి, గురు ప్రభోధ తారావళి గ్రంథాలను రచించారు. తర్వాత 97 సంవత్సరాల వయసులో 1995 డిసెంబరు 9న నిర్యాణం పొందారు. ఈయన నిర్యాణం పొందడానికి ముందుగా అదే ఏడాది ఆగస్టు 5న తన గురుపుత్రుడైన వాదన పిచ్చయాచార్యులకు భోధనాధికారాన్ని అప్పగించారు. నారాయణరెడ్డి స్వామి, అచలసిద్ధాంతానికి స్ఫూర్తిగా ప్రతీ ఏటా మార్గశిర మాసం బహుళ తదియ నాడు గురుపుత్రులు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు.


బ్రిటీష్ ప్రభుత్వ కంకణం పొందిన
దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి!



ఖాజీపేట మండలం సుంకేసుల గ్రామం రాజకీయంగా ఎంత ప్రాధాన్యత గల గ్రామమో అందరికీ విదితమే! రాష్ట్ర మాజీమంత్రి, మైదుకూరు శాసనసభ్యుడు డాక్టర్ డి.ఎల్. రవీంద్రారెడ్డి స్వగ్రామం సుంకేసుల. గత 30ఏళ్ళుగా రాజకీయాల్లో ఉంటూ, ఐదుసార్లు శాసనసభకు ఎన్నికై రాష్ట్ర మంత్రివర్గంలో వివిధ శాఖలకు మంత్రిగా డాక్టర్ రవీంద్రారెడ్డి వ్యవహరించారు. నేటి తరం ప్రజలు సుంకేసుల ప్రాధాన్యతను డాక్టర్ రవీంద్రారెడ్డి కారణంగా తెలుసుకున్నారు. నేటితరంలోన కాకుండా బ్రిటీషు పాలనాకాలంలో సైతం సుంకేసుల గ్రామ ప్రస్తావన ప్రముఖంగా ఉండేదని పదేళ్ల కిందట "ఖాజీపేట సుంకేసుల గ్రామాధికారిగా వ్యవహరించిన శ్రీ దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి చరిత్ర ద్వారా తెలుస్తోంది. బ్రిటీషు ప్రభుత్వ హయాంలో సైతం ప్రజాసేవలో నిమగ్నమై ప్రజల మన్ననలనూ, ప్రభుత్వ ప్రశంసలనూ ఏకకాలంలో పొందిన భారతీయులు చరిత్ర పుటలలో అరుదుగా తారస పడుతూ ఉంటారు. క్రీ.శ. 1870 – క్రీ.శ. 1904 సంవత్సరాల మధ్య కాలంలో సుంకేసుల గ్రామాధికారిగా వ్యవహరించిన శ్రీ దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి అలాంటి అరుదైన వ్యక్తుల కోవకు చెందుతారు.

అప్పట్లో కడప జిల్లా మద్రాసు రాష్ట్ర పరిధిలో ఉండేది. క్రీ.శ. 1915 నాటి కడప జిల్లా గెజిట్ లో సుంకేసుల ప్రస్తావన (పేజీ నెం. 186,187) ప్రముఖంగా ఉంది. అప్పట్లో ఖాజీపేట, సుంకేసుల రెవెన్యూ గ్రామ జనాభా 2,228గా పేర్కొన్నారు. ఖాజీపేట సుంకేసుల రెవెన్యూ గ్రామ పరిధిలో ఒక పోలీసుస్టేషన్, రెండు ప్రాథమిక స్థాయి బోర్డు పాఠశాలలూ, (వీటిలో ఒకటి ముస్లింకోసం కేటాయించబడింది.), ఒక బ్రాంచి పోస్టాఫీసు ఉండేది. రాయలసీమ ప్రాంతంలో అనేక గ్రామాలు ' సుంకేసుల ' గ్రామాన్ని 'ఖాజీపేట సుంకేసుల(కె.సుంకేసుల) గా సంభోదించడం జరిగింది. రికార్డుల లో చూస్తే అలాగే చేర్చబడి ఉంది. ఇక 'ఖాజీపేట' విషయానికి వస్తే కడప నవాబు కొలువులో పని చేస్తూ ఉండిన మీరాఖాన్ అనే సైన్యాధికారి ఖాజీపేటను కట్టించినట్లుగా గెజిట్‌లోని వివరాల ద్వారా విశదమవుతుంది. బ్రిటీషు పాలనా కాలంలో, సుంకేసుల గ్రామ చరిత్రలో శ్రీ దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి పాత్రను జిల్లా గెజిట్‌లో ప్రముఖంగా ప్రస్తావించారు. విధి నిర్వహణలో [illegible] ప్రజాసేవలో అంకిత భావం గుణాలు గ్రామాధికారిగా శ్రీ దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి కీర్తిని ఇనుమడింప చేశాయి. శ్రీ వెంకటరెడ్డి సేవలకు ముగ్ధుడైన అప్పటి కడప తాసిల్దార్, ఆయననూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగంలో చేరాల్సిందిగా ఆహ్వానించారు. 1877 సంవత్సరంలో రాయలసీమలో భయంకరమైన ధాతు కరువు వచ్చింది. ఈ కరువుకు ముష్టికరువు, డొక్కల కరువు, వలస కరువు అని కూడాపేరు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు కరువుతో అతలాకుతలం అయ్యాయి. రాయలసీమ ప్రజలు ఆకలి చావులకు గురయ్యారు. సుమారు రెండు లక్షలమంది కరువు వాతన పడి చనిపోయారు. గడ్డి కరువై పశువులు విపరీతంగా చనిపోయాయి. ప్రభుత్వం కొన్ని కరువు పనులను ప్రారంభించింది. ఈ పనుల్లో భాగంగా శ్రీ వెంకటరెడ్డి ఖాజీపేట నుండి సుంకేసుల మీదుగా కమలాపురానికి రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షించారు. ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు ఉపాధి కల్పించారు. ఆయన సేవలను గుర్తించిన బ్రిటీషు ప్రభుత్వం బంగారు కంకణాన్ని బహుకరించి సత్కరించింది. బ్రిటీషు అధికారి శ్రీ మ్యాక్ కార్తీ ఆధ్వర్యంలో చేపట్టిన పశుగ్రాస పంపిణీ కార్యక్రమం విజయవంతం కావడానికి శ్రీ వెంకటరెడ్డి ఎంతగానో కృషి చేశారు. ప్రభుత్వం ఆయన కృషిని కొనియాడింది. ఆ కాలంలో కలరా, తట్టు లాంటి ప్రాణాంత వ్యాధులు ప్రబలడంతో రోగులను ఆదుకునేందుకు శ్రీ వెంకటరెడ్డి నడుం బిగించారు. టీకాలు వేయించి అనేక మంది ప్రాణాలను కాపాడారు. ఈ సేవలను గుర్తించిన బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు మరోమారు సత్కరించింది. కంకణంతో సన్మానించింది. పన్నుల వసూళ్ళలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చూపుతూ, అసమర్ధతతో వ్యవహరిస్తున్న సంధర్భాలలో ఆ అధికారులకు ప్రత్యేక సహాయాధికారిగా శ్రీ వెంకటరెడ్డిని ప్రభుత్వం నియమించడం విశేషం. 1886 నుండి 1903 వరకు ఆయన తాలూకా బోర్డు సభ్యునిగా వ్యవహరించారు. తర్వాత జిల్లా బోర్డు సభ్యునిగా వ్యవహరించారు. తర్వాత జిల్లా బోర్డు సభ్యునిగా ఎంపికయ్యారు. శ్రీ వెంకటరెడ్డి దీక్షా దక్షతలను గుర్తించిన బ్రిటీషు ప్రభుత్వం తరపున వైస్రాయ్ నుండి 1905లో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.






నందేలమ్మ పేట!



నంద్యాలంపేట గ్రామాన్ని క్రీ.శ. 1642వ సంవత్సరం లో పేరనిపాడు కులకర్ణీ పనిచేసిన జంగమయ్య కుమారుడు గురప్పయ్య పౌరాహిత్యంలో ఉరుంపోసి నిర్మించారు. గొల్కొండ నవాబుల ఆధ్వర్యంలో దువ్వూరు ఖిల్లేదారుడుగా ఉండిన "మహమ్మదు అజేం" చొరవతో బొమ్మిడశానం శెట్టి, పాశంశెట్టిల ముఖాంత్రంగా పేట కొమర్లను, సాలెలను, కంచెర్ల వారిని, మిరాశీదార్లను గ్రామానికి చేర్పించడంతో నంద్యాలంపేట బస్తీగా రూపొందింది. అయితే గ్రామం ఏర్పడకముందే పరిసర గ్రామప్రజలు ఆ స్థలంమీదుగా వెదుర్లు, కట్టెలు తెచ్చుకొనేందుకు అడవికి వెళ్తూ స్త్రీ ప్రతిమ అయిన బేతాళపు శిలా విగ్రహాన్ని నిలిపారని, నందేల నుంచి యల్లమ్మ దేవత వచ్చి ఈ స్థలంలో వెలసిందని అప్పట్లో ప్రజలు భావిస్తూ ఉండేవారు. అదోచోట తర్వాత 'పేట' ఏర్పాటు కావడంతో "నందేలమ్మపేట" అని ఆ పేటకు పేరు వచ్చింది. అప్పటిదాకా పేరనిపాడు సముతిలో ఉన్న గ్రామాలన్నీ నందేలమ్మపేట సముతిలోకి వచ్చేశాయి. క్రీ.శ. 1716వ సంవత్సరం వరకు నందేలమ్మ పేట గోల్కొండ నవాబుల ఏలుబడిలో ఉండేది. తర్వాత కడప నవాబు అబ్దుల్ నబీఖాన్ క్రీ.శ. 1736 సంవత్సరం వరకు నందేలమ్మ పేటను పరిపాలించాడు. తర్వాత క్రీ.శ. 1756 వరకు మోచామియ్యా, నందేలమ్మపేట సమితిని ఏలుకున్నారు. ఆ తర్వాత మరాఠా నాయకుడు బల్వంతరావు నందేలమ్మ పేటపై సైన్యంతో దాడిజరిపాడు. గ్రామాన్ని దోచుకున్నాడు. మసీదు మియ్యాను బండి కనుమ వద్ద నిర్భంధించి తల కోశారు. అయితే క్రీ.శ. 1763 వరకూ మోచామియ్యా మళ్ళీ నందేలమ్మ పేటను పరిపాలించాడు. మోచామియ్యా పాలనా కాలంలో 'అవుకు' రాజు అనంతరాజు నందేలమ్మ పేటపై దాడి జరిపి పేటలోని సంపదనంతా పూర్తిగా దోచుకుపోయాడు. ఆ తర్వాత నంద్యాలంపేటను క్రీ.శ. 1779వ సంవత్సరం వరకు కడప నవాబు నబీఖాన్ తన ఆధీనంలో ఉంచుకున్నాడు. తర్వాత దువ్వూరు పరగణా ఏలుతూ ఉండిన నవాబు గనీబేగ్ నందేలమ్మపేటను ఏలుతూ ఉండగా, 'నొస్సం' సంస్థానీకుడు జయరామిరెడ్డి దాడిజరిపి ఈ పేటను దోచుకున్నాడు. తర్వాత మైసూరు పాలకుడు టిప్పుసుల్తాన్ పాలనలో 1783 నుండి దువ్వూరు పాలకుడు గనీబేగ్ మళ్లీ 'నందేలమ్మపేటకు పాలకుడయ్యాడు.







రెండేళ్ళు మోదీన్‌ఖాన్ పరిపాలించాడు. క్రీ.శ. 1790 సంవత్సరం నుండి రెండు సంవత్సరాల పాటు సైదులావద్దీన్, పరిపాలించాడు. ఆ తర్వాత వరుసగా దిలారుద్దౌలా, అమీన్‌సాహెబ్, బనగాన పల్లె, అసదల్లీఖాన్, రాజాచందూలాల్, పరిపాలించారు.

క్రీ.శ 1800 వ సంవత్సరం నుండి బ్రిటీషు పాలన లోకి నందేలమ్మ పేట వచ్చింది.

బ్రిటీషు కలెక్టర్ " కల్నల్ మన్రో" నంద్యాలంపేట, ఎల్లంపల్లె, శెట్టివారిపల్లె చెరువులను మరమ్మత్తు చేయించాడు. నంద్యాలంపేట గ్రామం మధ్యలోని వీరభద్రుని దేవాలయం ఆంజనేయ దేవాలయాలు అతి పురాతనమైనవి. గ్రామంలో మసీదు నిర్మాణం కూడా జరిగింది. ప్రాచీనకాలం నుండి నంద్యాలంపేట సముతిలోని రైతులు సజ్జలు, రాగులు, పచ్చజొన్నలు, ఆరికెలు, చామలు, వడ్లు, కొర్రలు, అలసందలు, కందులు, పెసలు, నువ్వులు, అనుములు, గోగులు, నీరుళ్ళి, తెల్లఉల్లి, ఆకుతోటలు, చెరుకుతోటలు, పసుపు, జీలకర్ర, నీలితోటలు, కొత్తిమీర పండించేవారు. నందేలమ్మపేట లోని సాలెలు తమ మగ్గాలపై 40మూర్ల పొడవు, 3 జానల వెడల్పుగల భారీ శల్లాలు, మూడు రూపాయల నుండీ పదేసి రూపాయల విలువైనవి నేసేవారు. అలాగే 18 మూరల పొడుగు, గజం వెడల్పు గలిగిన సన్నపరకాళాలు నేసేవారు. వీటిధర ' 3రూపాయల నుండి 8రూపాయల' దాకా ఉండేది. భారీ తెల్ల పాగాలు, తెల్లచీరెలు, ధోవతులు, వనితక పచ్చడపు రేకులు, ముతక ఎర్ర గొల్కులు చీరలు, నీలిచీరెలు మగ్గాలను నేసేవారని మెకంజీ కైఫీయత్తులో పేర్కొనబడింది.

నంద్యాలంపేట బ్రిటీషు కాలంలో కూడా ప్రముఖ పరిపాలన కేంద్రంగా వెలుగొందింది. ఇక్కడే కోర్టుకచేరీ నడిచేది. రెవెన్యూ వ్యవహారాలు కూడా నందేలమ్మపేట తాలూకా కేంద్రంగా జరుగుతూ ఉండేవి. గ్రామంలో ఇప్పటికీ కోర్టు కచేరి తదితర శిథిల ఆనవాళ్ళను మనం చూడవచ్చు.

నంద్యాలంపేట గ్రామంలో ప్రధాన వీధి వెడల్పుగా బస్తీ లక్షణాలతో ప్రాచీన చారిత్రక నేపథ్యానికి తార్కానంగా నిలిచివుంది.

– తవ్వా ఓబుల్‌రెడ్డి







ఫిరంగుల గుండ్లకు నేల కొరిగిన

మైదుకూరుకు తూర్పు వైపున ఉన్న ముక్కొండ ప్రాంతంలో క్రీ.శ. 1420 ప్రాంతంలో పేరయ్య, లోకయ్య అనే యాదవులు గొర్రెలు మేపుకుని జీవించేవారు తమకులంలోని 'కర్రిణ' తెగకు చెందిన వారు. కాలక్రమేణా వారికి మరికొందరు గొల్లలు తోడు కావడంతో ఒక గొల్ల పల్లెను ఏర్పరచుకున్నారు. అయితే పల్లె నిర్మించిన స్థలం అచ్చుబాటు కాకపోవడంతో మరికొంత దూరంలో గ్రామాన్ని తిరిగి నిర్మించుకున్నారు. అక్కడికి సమీపంలో ఓ బుగ్గ నుండి ఊటనీరు పారుతూ ఉండేది. గొర్రెలకు అడవిలోని గడ్డిని మేపుతూ బుగ్గనీరు త్రాపుకుంటూ గొల్లలు తమ జీవితాలను కొనసాగిస్తున్న సమయంలో శ్రీ సోమరాజు, తిప్పలదేవిల కుమారుడైన తూర్పు ప్రాంతరాజు శ్రీ సంబెట పిన్నయ్య దేవ మహారాజు తన కుమారునికి వధువుని చూసేందుకు బెజవాడ వైపునకు వెళ్తూ ఆ దారిలో పరివారంతో గొల్లపల్లె సమీపానికి చేరుకున్న తర్వాత మంచినీటి కోసం చూశారు. ముందుగా నీరు ఎక్కడా కనిపించలేదు. కొంతసేపు వెతికిన తర్వాత మడుగులో పొర్లిన కుక్క ఒకటి వారికి ఎదురైంది. ఆ కక్కను వారు అనుసరించి వెళ్ళగా గొల్లలు పేరయ్య, లోకయల నివాసం వద్దకు కుక్క వెళ్ళింది. అక్కడికి వెళ్లిన రాజ పరివారం గొల్లల వద్ద తమ దప్పికను తీర్చుకున్నారు. ఆ తర్వాత మర్రిచెట్టు కింద కూర్చున్న రాజు సంతోషంగా విశ్రాంతి పొందుతూ పేరయ్య, లోకయల తాంబూలం ఇచ్చాడు. ఆ సమయంలో మర్రిచెట్టుపైన ఉన్న 'పైడికంటెలు' అనే పక్షులు తమ అరుపులో మూడు వాక్యాలు పలికాయి. ఆ పక్షుల వాక్యాలు అర్థం చేసుకున్న గొల్లలు నవ్వారు. రాజుకూ, రాజపరివారానికి ఆ పక్షుల అరుపులకు అర్థం తెలియదు. పక్షులు ఎందుకు నవ్వారని, అర్థంచెప్పాలని రాజు పేరయ్య, లోకయ్య లను అడిగాడు. అర్థంచెపితే రాజు కోపగించుకుంటాడేమోనని వారు సంశయించారు. ఏమి పర్వాలేదు, అని రాజు భరోసా ఇవ్వడంతో పక్షుల వాక్యాలలో అర్థాలను చెప్పారు.









పేర్నిపాడు


ఆ అర్థాలు ఇలా ఉన్నాయి

1. రాజు ఏ వధువును చూసేందుకు పోతున్నాడో ఆ యువతి మూడు మాసాల గర్భిణి
2. ఈ రాజు ఈ భూమిని పాలించే విధి ఉంది ముందుకు ఎలా పోతాడు
3. ఈ స్థలం నిధినిక్షేపం ఉంటే ఎలా వదలి వెళ్తాడు.

ఆ పక్షుల వాక్యాలకు అర్థాలు

ఇవి. దీంతో రాజు తన ప్రయాణాన్ని రద్దు చేసుకుని అక్కడే ఉండిపోయాడు. పక్షులు చెప్పినట్లు ఆయువతి గర్భవతేనని రాజు తన మనుషులతో జరిపిన విచారణ ద్వారా నిర్ధారించుకున్నారు. నిధుల కోసం వెతకగా రాజపరివారం నిధిని కనుగొంది. దీంతో రాజు ఇక్కడే కోట కట్టించుకొని ఈ ప్రాంతాన్ని పరిపాలించాలని నిర్ణయించుకుని, పేరయ్య, లోకయ్య సలహాను కోరి ప్రస్తుతం ఉన్న యల్లంపల్లె గ్రామానికి ఉత్తరాన అరకిలోమీటరు దూరంలో మూడు ప్రాకారాలతో కూడిన బలమైన కోటను నిర్మించాడు. శ్రీ వీరభద్రస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ ఈశ్వర దేవాలయాలను కట్టించాడు. రాజు సైన్యాధ్యక్షుడైన 'హెగ్గడన్న' కోటకు సమీపంలో ప్రజల నివాసానికి 'పేట'ను కట్టించాడు. గగ్గితిప్పకు పశ్చిమ భాగంలో "ఆట భైరవున్ని నిలిపాడు. శ్రీ తిరుమల నాథుని గుట్ట సమీపంలో మామిడి, జువ్వి, చింత, మర్రి వృక్షాలతో తోట వేశారు. ఖిలమైపోయిన ఆట భైరవుని దేవస్థానం నిలువెత్తు గోడలతో రాతిశాసనం లభించింది.ఆ శాసనంలో పిన్నయ్యదేవమహారాజు పాలన సంబంధించిన విషయాలు ఇలా చెక్కబడి ఉన్నాయి.








"స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక 1350 (క్రీ.శ. 1428) అగు 'కీలక' నామ సంవత్సర శ్రావణ శుద్ధ 15లు శ్రీ మన్మహారాజాధిరాజ రాజా పరమేశ్వర శ్రీ వీర ప్రతాపదేవరాయ మహారాయలు చతుసముద్రాధీశ్వరుడై విజయనగరమందు సుస్థిరమున సింహాసనారూడుడు రాజ్యం చేస్తుండగా, శ్రీ మన్మహా మండలేశ్వర అత్యంత గండ సంబెట పిన్నయ దేవ మహారాజు పేరనిపాటను రాజ్యం సేయుచునుండగాను పిన్నయ నగరికి కోట పెట్టించి, ముకుంద శెట్టి కొడుకు హెగ్గడన్నగారు సమస్త రాజ్యాను కర్తుండై 'గగ్గితిప్ప' కి పడమటను పందుముతోట ఒక వనంపెట్టి బావి తవ్వించి ఆట భైరవ దేవరకు ముత్తుం చేను ధారపోసి, ఆ పూజ చేసే తమ్మడికి పెండ్లిచేసెను. పిన్నయ్యకు వారి తల్లి తిప్పలదేవి కిన్నీ, తండ్రి సోమయ్యకున్ను, పుణ్యంగాను అన్నంగారు నిల్పిన ధర్మశాసనం"

అని ఆ రాతిశాసనంలో రాయబడి ఉంది. ఈ శాసనానికి ఉత్తరంవైపున కూడా ఇలాంటిదే మరో శాసనం కూడా బయల్పడింది.


ఈ విధంగా కోట, పేట కట్టిన తర్వాత "పేరనిపాడు" అని పేరు పెట్టడానికి కారణం ఇలా ఉంది. రాజు పేరయ్య, లోకయ్యలను పిలిపించి, కొత్త రాజ్యం ఏర్పాటైన సందర్భంగా వరం కోరుకోమని అడిగాడు. అప్పుడు పేరయ, కోటకు తన పేరు పెట్టాలని కోరాడు. లోకయ్య తన పేరు మీద ఒక గ్రామం కట్టించాలని కోరాడు. దీంతో రాజు 'లోకాయపల్లె' కట్టించాడు. తర్వాత గడ్డంవారిపల్లె కట్టించాడు. తూర్పున జైనుల మఠం (జాండ్లవరం), బుగ్గవంక సమీపంలో కాలువపల్లె నిర్మించారు.

శ్రీ పిన్నయదేవ మహారాజు 'పేరనిపాడు' కసుబా తో పాటు పై గ్రామాలను ఏలుకుంటూ దువ్వూరు, చెన్నూరు ప్రాంతాలకు కావలి కట్నాలను నిర్ణయించాడు. "నానుబాల" అనే వారి ఇంటిపేరు కలిగిన పేరయ్య, లోకయ్యల నాయకత్వాన్ని కోటకు నిర్ణయించాడు. రాజపరివారంతో బాటుగా వచ్చిన 'గురప్పయ్య' అనే బ్రాహ్మణున్ని 'కులకర్ణీకం'గా చేసి, తన ప్రధాన రాజధానికి తిరిగివెళ్ళి, పేరనిపాటి రాజ్యాన్ని పర్యవేక్షిస్తూ ఉండేవాడు. శ్రీ పిన్నయదేవ మహారాజు కుమారుడు "శివరాజు" కూడా పేరనిపాటిని పాలించాడు.

శాలివాహన శకం (క్రీ.శ. 1503)వ సంవత్సరం 'రుధిరోద్గారి' సంవత్సరంతో శ్రీ శివరాజు ప్రస్తుత యల్లంపల్లె గ్రామానికి తూర్పున కొండపై ఉన్న శ్రీ తిరుమలనాథాలయాన్ని నిర్మించాడు. ఈ గ్రామానికి తూర్పున రెండు వరుసల దూరంలో ప్రస్తుతం ఉప్పుగుంటపల్లెకు తూర్పున బుగ్గ ఉన్నచోట ఋషి ప్రతిష్ఠత ఈశ్వర లింగానికి శివరాజు దేవాలయం కట్టించాడు. ప్రస్తుతం జాండ్లవరం ప్రాంతంలోని "మాచుపల్లె" ఇంటిపేరు గలవారి పూర్వీకులు పేరనిపాటిపట్నం, 'పేటాకాపు' విధులకు నిర్వహించేందుకు రాజు కావలిమాన్యాలిచ్చారు. ఆ తర్వాత కోటపై విజయనగర రాజు సాలువ నరసింగరాయలు దాడిచేశారు. కోటపైకి దక్షిణంవైపునుండి దాడిచేసి ఫిరంగి గుండ్లు కురిపించారు. గగ్గితిప్పకు ఉత్తరాన ఫిరంగుల ప్రయోగానికి ఎత్తైన బేచుమట్టం కట్టించి ఫిరంగులతో గుండ్లను కురిపించడంతో, సైన్యంతో దాడిచేశారు. బలిష్టమైన పేరనిపాటి కోట ఫిరంగుల భీకర దాడికి నేలమట్టం అయింది. ఎందరో సిపాయిలు ప్రాణాలు వదిలారు. కొందరు సిపాయిలు, ప్రజలు పారిపోయారు. దీంతో రాజు కుటుంబం కోటలోనే దైవగతిని పొందింది. కరణం గురప్పయ్య కూడా కోటలోనే ప్రాణాలు వదిలాడు.చరిత్రలో బలమైన స్థానిక రాజ్యంగా విలసిల్లిన పేరనిపాడు స్మృతుల ఆనవాళ్లు అనేక చారిత్రక పరిశోధకులకు లభించాయి. శాలివాహనకాలం 1427 (క్రీ.శ. 1505) వరకు శ్రీ నరసింహరాయ మహారాయలు ఏలుబడితో గగ్గితిప్పకు తూర్పున ఉన్న మడుగులో సంస్థానీకుల గుర్రాలు నీళ్ళు త్రాగేవి. అందువల్ల ఆ మడుగుకు "గుర్రాల మడుగు" అనే పేరు వచ్చింది. గగ్గితిప్పకు దక్షిణ భాగాన పేరనిపాటి రాజ్య సైనికులు గరిడి చేసే మిట్ట ఒక పెద్ద కళ్ళం మాదిరిగా గచ్చుతో ఉండేది. అది ప్రస్తుతం మట్టికింద వ్రాడిపోయింది. పేరనిపాడు పరిసరాల్లో వీరభద్ర, ఆంజనేయ, ఈశ్వరదేవాలయంలు అప్పట్లో వెలిశాయి. వాటి ఆనవాళ్ళూ కొన్ని నేటికి ఉన్నాయి.



శ్రీ కృష్ణదేవరాయలు గడ్డంవారిపల్లె గ్రామాలను శ్రీ తిరుమలనాథుని ఆలయ ఉత్సవ కైంకర్యానికి ఇచ్చినట్లు శిలాశాసనంద్వారా విదితమవుతోంది. గడ్డంవారిపల్లె హనుమంతరాయుని విగ్రహం అరుగు వద్ద ఉన్న శాసనంలో కూడా ఈ వివరాలు ఉన్నాయి.



అంకాళమ్మ దేవత

విజయనగర రాజు శ్రీ సదాశివరాయలు కాలం వరకూ కూడా పేరనిపాడు గ్రామం ఉండేది. ఆ తర్వాత మహమ్మదీయుల పరిపాలన కాలంలో పేర్నపాడు గ్రామం పూర్తిగా ఖిలపడిపోయింది. ప్రస్తుతం యల్లంపల్లె, చిన్నయ్యగారిపల్లె, గ్రామాల మధ్య కోట, పేట అనే ప్రదేశాలు వున్నాయి. పేరయ్య, లోకయ్య వారసులు నానుబాల తిరుమలరెడ్డి, మాదిరెడ్డిలు నానుబాలపల్లెలో తర్వాత జీవించారు. పేర్నపాటి స్థలంలో పురాతన కాలంనాటి చెంద్రాయుని దేవాలయం, శ్రీ ఆంజనేయుని తిరిగిన రాతి విగ్రహం, అంకాలమ్మ గుడి కూడా ఉన్నాయి.

చరిత్రలో వైభవ దీప్తులు వెదజల్లిన పేరనిపాడు రాజ్యం అవశేషాలను పరిరక్షించి, భావితరాలకు అందించగలిగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– తవ్వా ఓబుల్‌రెడ్డిల





వనిపెంట

ఛోళ మహారాజు పరిపాలనా కాలంలో నగ్ర గొల్లలు ఆవుల మందలను మేపుకుంటూ నల్లమల అరణ్యంలో కొట్టాలు వేసుకుని జీవిస్తూ ఉండేవారు. వారి నివాసస్థలంలో ఆవులఎరువుకొండ గుట్టలవలె ఉండేది. ఆ ఎరువును రైతులు 'వనంపెంట'గా పోలాలకు వినియోగించేవారు. వనంపెంట దొరికే చోటే క్రమంగా "వనిపెంట"గా మారింది.

ఆ గొల్లలు నివశించే ప్రదేశానికి మరికొందరు వచ్చి , ఆ గొల్లవారితో పను చేయించుకుంటూ, వనిపెంటకు తూర్పు భాగంలో వజ్రాల కోసం కొండను తవ్వేవారు. దీంతో ఆ ప్రదేశానికి ఇతర ప్రాంత ప్రజల రాకపోకలు అధికమయ్యాయి. అక్కడ నివసించేవారి సంఖ్యపెరిగింది. తమ గ్రామానికి రెడ్డి, కర్ణీకములు నిర్ణయించుకున్నారు. తర్వాత గ్రామస్థులు చోళమహారాజును కలిసి తమ గ్రామంలో వాల్మీకి మహర్షి ప్రతిష్టించిన ఈశ్వరలింగం ఉందని, అక్కడ ఉన్న చిన్న మంటపానికి బదులుగా దేవాలయం కట్టించమనీ కోరడంతో మహారాజు గ్రామాన్ని సందర్శించి, శివాలయం కట్టించారు. తర్వాత రాజుల కాలంలో వనిపెంట మజిరాపల్లెలుగా తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె, ఆదిరెడ్డిపల్లె, తాతిరెడ్డిపల్లె, పప్పనపల్లె, మిట్టభూమనపల్లె, విశ్వనాథపురం ఉండేవి.

వనిపెంటలో ప్రఖ్యాతి గాంచిన చెన్నకేశవ ఆలయాన్ని ప్రతాపరుద్ధ దేవమహారాజ కాలంలో నిర్మించారు. హరిహరరాయలు, ఫౌఢ దేవరాయలు

ఈ ఆలయానికి ఉత్సవ కైంకర్యాల కోసం మిట్టభూమనపల్లె, పప్పనపల్లె గ్రామాలను

" వనిపెంట దేవ దేవోత్తముండైన చెన్నకేశవుని అమృత పళ్ళకు చెల్లె మిట్టభూమనపల్లె, పప్పన పల్లె గ్రామాలను విప్రవినోదులకు ఇచ్చే వర్తనులు చెన్నకేశవుని అమృతపళ్ళకు, ఆరగింపులకు ధారవాసి ఇస్తిమి"- అని దేవస్థానం తూర్పు ప్రాకారపు గోడన మధ్యన ఉన్న శిలాశాసనంలో పేర్కొన బడింది.

కేటాయించారు. ఇందుకు ఆధారంగా, శిలాశాసనం కూడా ఉంది.

" వనిపెంట దేవ దేవోత్తముండైన చెన్నకేశవుని అమృత పళ్ళకు చెల్లే మిట్టభూమనపల్లె, పప్పన పల్లె గ్రామాలను విప్రవినోదులకు ఇచ్చే వర్తనులు చెన్నకేశవుని అమృతపళ్ళకు, ఆరగింపులకు ధారవోసి ఇస్తిమి"- అని దేవస్థానం తూర్పు ప్రాకారపు గోడన మధ్యన ఉన్న శిలాశాసనంలో పేర్కొన బడింది.

ఈ శాసనం సదాశివరాయల ఏలుబడిలో శా॥ శకం 1475 (క్రీ.శ1553) ప్రమాదీచ సంవత్సరంన ముద్రించబడింది. జాతిలో వెలమవారైన మగ్రివారు పోతిరెడ్డిపల్లె (తాతిరెడ్డిపల్లె) వద్ద కోట కట్టుకొని పరిసర గ్రామాలతో పాటు వనిపెంటను ఏలుకుంటూ ఉండేవారు. మగ్రివారి వనిపెంటగా ఇదిపిలువబడేది. సాళువ నరసింహరాయలు ఏలుబడి పర్యంతం వారు అనుభవించారు. తర్వాత వారు రాజులకు వ్యతిరేకులైనందున 'రాయలసైన్యం' వనిపెంట పశ్చిమభాగాన దిగిఉండగా ' మగ్రివారు' యుద్ధంచేసి అశువులు బాశారు. వారి భార్యలు భర్తల శవాలతోపాటు అగ్నిప్రవేశం చేశారని ప్రతీతి. ఇప్పటికీ "మగ్రివారి గుండాల" స్థలం ఉంది. అక్కడ కొండవాగు ఉంది.

(ఆ తర్వాత రేకులకుంట జంగంరాజుపల్లె సంస్థానీకులైన చల్లా పినతిప్పనాయుని కుమారుడు చల్లా వీరమనాయునింగారు ఉండగా) గుత్తి కంచిరాజకుకు నరసింగదేవరాయలు వనిపెంటను ఆధీనం చేశారు. ఆ కంచి రాజు చల్లా

వీరమనాయునికి ఆధీనం చేశారు. అప్పుడు వీరమనాయుడు వనిపెంటచెన్నకేశవుని పగటి అవసరాలకు వరిమడి మాన్యం ఇచ్చారని తూర్పుగోడపై శాసనం ఉంది) .తరువాత రాయసం గంగరసు పాలించారు.

సదాశిరాయలు ఏలుబడితర్వాత-- చిట్వేలు మట్లి కాకరాజు, అనంతరాజు ఏలుబడిలో తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డి పల్లె, అగ్రెడ్డి పల్లెలు మినహా వనిపెంట పల్లెలు పల్లెలు శా॥శకం 1560 (క్రీ.శ. 1638) అగు బహుదాన్య సం॥ వరకు జరిగింది.

- ఆ తర్వాత గొల్కొండ మొగలాయిల పాలన శా॥లు శకం 1632 (క్రీ.శ. 1710) వికృత సం॥ జరిగినది.

-తుమురుటి చిన్న కృష్ణప్ప అనే బ్రాహ్మణికి ఆర్కాటు నవాబులు జాగీరు ఇచ్చారు. ఇన్న కృష్ణప్పగారి అన్న పెద్ద కృష్ణప్ప వచ్చి శా॥శకం 1638 (క్రీ.శ. 1716) దుర్మిఖి వరకు జాగీరు అనుభవించారు.

- ఉషేన్‌మియ్యా కీలక వరకు

- 1671 (క్రీ.శ. 1749) శుక్ల వరకు, ఉషేన్‌మియ్యా భార్య బేగం సాహెబ్ జాగీరు అనుభవించారు.

వారి కుమారుడు అబ్దుల్ వహాబ్‌ఖాన్ 1673 (క్రీ.శ.1751) ప్రజోత్పత్తి వరకు 2 ఏళ్ళు అనుభవించెను.

తర్వాత మట్లి వెంకట్రామరాజు, తర్వాత దువ్వూరు పరిగణా చూస్తున్న హండేబాగ్ పంతులు గారికి వశం చేశారు.తర్వాత అలీంఖాను ఏలుబడిలో 1686(క్రీ.శ. 1764) వనిపెంట, టంగుటూరు, ఏరువపాళెం, తొండలదిన్నె, కుచ్చుపాప, నేలటూరు, గురువలూరు, అబ్దుల్‌ఖాదరు అమానుని ఉంచి ఏలుబడిజరిగింది. తర్వాత మన్వర్‌ఖాన్, శిద్దహిలాల్ ఉషేన్‌మియ్యా, కర్మామియ్యా,లు పరిపాలించారు. ఉషేన్‌మియా కర్మామియ్యా, సోదరులు మిట్టభూమనపల్లె వద్ద పెద్ద నవాబుకు పట్టుబడ్డారు. బహదరు సిద్దవటం పోయి అలీంఖానుని పట్టుకొని శ్రీరంగం తీసుకెళ్ళిన తర్వాత బహదరు వారు ఆక్రమించి మీరుసాహెబ్ స్వాధీనం చేశారు. తర్వాత పాతకోట తిమ్మారెడ్డి ఆధీనంలోకి వనిపెంట వచ్చింది. తర్వాత టిప్పుసుల్తాన్ కాలంలో మీర్జాగనీబేగం, ఉషేనల్లీఖాన్, ఇమోంమోదీఖాన్, మొగలాయి వారి ఏలుబడిలో సైగలావర్దీన్ ఖాన్, దిలావరుబ్దేలా, అరబు అమీన్ సాహెబ్, తర్వాత బనగానిపల్లె, అసదల్లీఖాన్ ఉరఫ్ ముజుపర్ముల్క్ రాజ చందూలాల్, కంపెనీ ఇంగీజు బహదరు ఏలుబడిలో జరిగింది.

-వనిపెంట గ్రామరెడ్డి 'అయ్యలరెడ్డి' గ్రామంమధ్యలో కోట కట్టించారు. ప్రాచీన కాలంలోనే గ్రామంలో -ఆంజనేయ, వీరభద్ర దేవాలయాలు కంచరపేటలో- కాళికార్ విదారు మంటపం లాంటి విశిష్టమైన దేవాలయాలు వెలిశాయి.


-తవ్వాఓబులేరెడ్డి



వనిపెంట కోట




కోటలోని గుడి



బ్రిటీష్‌కాలం నాటి డిస్పెన్సరీ



రామాలయం




కేసీ రైతులకు చిరస్మరణీయుడు
సర్ ఆర్థర్ కాటన్

కరవు కాటకాలతో అలమటిస్తున్న రాయలసీమకు కాలువల ద్వారా జలాలను అందించేందుకు కృషి చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్. కాటన్ కృషి వల్ల రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలోని క్షామపీడిత, బీడు భూములకు కొంతమేరకైనా నదీజలాలను మళ్లించే అవకాశం కలిగింది. కె.సి.కెనాల్ ద్వారా కడప కర్నూలు జిల్లాలు, తుంగభద్ర హెచ్.ఎల్.సి ద్వారా అనంతపురం జిల్లాకు తుంగభద్ర జలాలు తరలించే ప్రాజెక్టు ప్రారంభం వెనుక కాటన్ అనితర సాధ్యమైన కృషి ఉంది

కె.సికెనాల్‌కు కడప జిల్లాలో ప్రధాన కార్యాలయం మైదుకూరులో ఉంది. ఇక్కడి డివిజనల్ కార్యాలయం నియంత్రణలో దాదాపు జిల్లాలో కెసికెనాల్ ద్వారా సాగునీటి సరఫరా జరుగుతూ వస్తోంది. కర్నూలు జిల్లా సుంకేసుల బ్యారేజీ మొదలుకొని కడప సమీపంలోని కృష్ణాపురం వరకు 305.6 కి.మీ. పొడవైన కెసికెనాల్‌ను తవ్వడంతో, ఆ కాలువే రాయలసీమ ప్రజలకు జీవనాడి అయింది. కెసికెనాల్ ద్వారా కడప, కర్నూలు జిల్లాలలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఏర్పడింది. ఈ సాగునీటి సౌకర్యం కోసం సర్ ఆర్థర్ కాటన్ బ్రిటీషు పాలకులతో పెద్దగా వాదించడానికి రాయలసీమలో ప్రబలుకున్న కరువు పరిస్థితులే కారణం.

రాయలసీమలో క్రీ.శ. 1821 నుండి 1843వ సంవత్సరం వరకూ భయంకర కరువు విలయ తాండవం చేసింది. 1826-27 సంవత్సరాలలో కరువు పరాకాష్టకు చేరుకుని సీమప్రాంతంలో స్మశాన వాతావరణం నెలకొంది. రాయలసీమతోపాటు తెలుగునాట నెలకొన్న కరువువల్ల ఆ రెండు దశాబ్దాల కాలంలో ఒక లక్షా 77 వేల 267 మంది ప్రజలు మరణించారు. రాయలసీమలో ఎక్కడ చూసినా, రాళ్ళగుట్టలతోపాటు శవాలగుట్టలూ, జంతు కళేబరాలు మోడు వారిన చెట్లూ దర్శన మిచ్చాయి. నిర్భాగ్య స్థితిలో కొట్టుమిట్టాడుచూ ప్రజలు చేసిన హాహాకారాలు సీమ నాలుగు చెరుగులూ ప్రతిధ్వనించాయి .


గంజినీళ్ళు తాగో, ఆకులూ, అలుములూ తినో ప్రాణాలను నిలబెట్టుకోవడానికి రాయలసీమ ప్రజలు ప్రయత్నించారు. ఈస్టిండియా కంపెనీ ఆధ్వర్యంలోని బ్రిటీషు ప్రభుత్వం దృష్టికి కరువు సమస్య వెళ్ళింది. “సర్ హెన్రీ మౌంట్ గౌమారీ” అనే అధికారి ఆధ్వర్యంలో కరువు తీవ్రతనూ, సంభవించిన ప్రాణ నషాన్నీ అంచనా వేసేందుకు బ్రిటీషు పాలకులు కమిటీ వేశారు. “ ప్రజలకు మంచినీటి సౌకర్యం” కల్పించడంతో ప్రభుత్వం ఉపేక్ష వహించింది. చెరువులను మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యం వహించింది. అవినీతిపరులైన గ్రామాధికారులు ప్రజలను బాగా పీడించారు విలాసాలలో మునిగిన సంస్థానాధీశులు ప్రజల సంక్షేమాన్ని విస్మరించారు”- అంటూ మౌంట్ గౌమారీ కమిటీ నిష్పక్ష పాతతతో బ్రిటీషు ప్రభుత్వానికి నివేదిక అందచేసింది. అయితే ఈ నివేదికపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదు. కరువుకూ, తుపాను లాంటి ప్రకృతి వైపరీత్యాలకు ప్రభుత్వమెలా భాధ్యత వహిస్తుందంటూ బ్రిటీషు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వ్యక్తం చేసింది. ప్రజల ప్రాణాలు తృణ ప్రాయమన్న వైఖరిని ప్రదర్శించింది. అటు ప్రకృతి సహకరించక, ఇటు ప్రభుత్వం దయచూపక ప్రజల పరిస్థితి హృదయవిదారకంగా తయారైంది. కరువు రక్కసి సాగిస్తున్న ఘోర కలికి చలించిపోయాడు. సర్ ఆర్థర్ కాటన్, గోదావరి నదిపై దేశంలోనే అతి పెద్దదైన మూడున్నర మైళ్ళ పొడవైన ఆనకట్టను అప్పటికే నిర్మించిన విశేష అనుభవం గడించి ఉన్నారు. తన అనుభవాన్నీ, సేవలనూ రాయలసీమ ప్రజలకు కూడా అందించాలనీ కాటన్ నిర్ణయించుకున్నాడు. కమాండెంట్ ఆఫ్ ఇంజనీర్స్ హోదాలోఉండిన కాటన్ రాయలసీమలో కరువు నివారణ గురించి బ్రిటీషు ప్రభుత్వంతో సంప్రదింపులు ప్రారంభించారు. రాయలసీమ నుండి ఇనుపగజ్జెల కరువు రక్కసిని పారద్రోలే తొలి ప్రయత్నంలో భాగంగా తుంగభద్ర రిజర్వాయర్ నిర్మించాలని కాటన్ ప్రతిపాదించాడు. ఆ కాలువే కెసికెనాల్! తన ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు బ్రిటీషు ఈస్టిండియా కంపెనీతో కాటన్ పెద్ద వాజ్యమే ఆడాల్సి వచ్చింది. కాటన్ వాదనలతో దిగివచ్చిన ప్రభుత్వం కె.సికెనాల్ తవ్వకానికి నిధులను మంజూరు చేయక తప్పలేదు.



" మద్రాసు ఇరిగేషన్ అండ్ కెనాల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ అనే 'డచ్' కంపెనీ 1863 వ సంవత్సరంలో కెసికెనాల్ తవ్వకాన్ని చేపట్టింది. 1870వ సంవత్సరంలో కెసికెనాల్ నిర్మాణం పూర్తయింది. 1865వ సం॥లో కర్నూలుకు చేరిన తుంగభద్ర జలాలు 1871 నాటికి కడప చేరాయి. కర్నూలు కడప జిల్లాలలో 2 లక్షల 65వేల ఎకరాల ఆయకట్టు ఏర్పడింది.

మైదుకూరు నియోజకవర్గం కెసికెనాల్ నీటి వాటాలో సింహభాగాన్నే పొందుతోంది. అప్పటి దాకా నియోజకవర్గ ప్రాంతంలో రేగి, పరిగ కంపలతో బీళ్ళుగానూ, కొర్ర, జొన్న పండే రేగళ్ళుగానూ ఉండిన భూముల్లోకి తుంగభద్ర జలాలు పారడం మొదలైంది. వరిసాగు కూడా ఆ తర్వాత ప్రారంభమైంది. నాట్లు నాటేటపుడు, కోతలు కోసేటపుడు, చివరికి నోటిలోకి అన్నం ముద్ద వెళ్ళేప్పుడూ స్మరించుకోతగిన మహనీయుడుగా సర్ ఆర్థర్ కాటన్ మిగిలిపోయాడు.

కాటన్ మహాశయుని జీవిత విశేషాలను తెలుసుకోవాల్సిన అవసరం, తెలుగు ప్రజలకు ఎంతగానో ఉంది. సర్ఆర్థర్ కాటన్ ఇంగ్లాండ్‌లోని కాంబర్ మిర్ అబీ లో 1803 మేనెల 15న జన్మించారు. తండ్రి కాల్‌వెలీ కాటన్, తల్లి హెన్రీ కాల్‌వెలీ కాటన్. కాటన్ తన 15వ ఏట ఈస్టిండియా కంపెనీ మిలిటరీ కళాశాలలో సైనిక శిక్షణ పొందారు. 1819లో మద్రాసు ఇంజనీర్ల కమీషన్‌లో స్థానం పొంది 1821లో అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగంలో చేరారు. ప్రవేశ పరీక్ష లేకుండానే రాయల్ ఇంజనీర్ సంస్థలో సభ్యుడయ్యారు. కాటన్ ముందుగా కావేరీ డెల్టాలో ఆనకట్ట నిర్మాణాన్ని ప్రతిపాదించారు. దీంతో 1836లో 'కొలరూను' ఆనకట్ట నిర్మాణం జరిగిపోయింది. కావేరి డెల్టా బంగారు పంటలకు నిలయమైంది. ఆంధ్రప్రాంతంలో కరువులై దృష్టి సారించిన కాటన్ 1847లో గోదావరిపై ధవళేశ్వరము ఆనకట్ట నిర్మాణాన్ని చేపట్టారు. 10 లక్షల ఎకరాలకు నీరందించారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా మార్చారు. 1860లో కాటన్ పదవీ విరమణ చేశారు.



ఆ తర్వాత కూడా బీహార్, ఒరిస్సాలలో ప్రాజెక్టు నిర్మాణానికి సేవలను అందించారు. కాటన్ సేవలను గుర్తించిన బ్రిటీష్ విక్టోరియా మహారాణి 1866లో కెసిఎస్‌డి బిరుదును ప్రదానం చేసి గౌరవించింది. 1899 జులై 27న కాటన్ తన 96వ ఏట కన్నుమూశారు. 2003న సంవత్సరంలో కాటన్ ద్విశత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

-తవ్వా ఓబుల్‌రెడ్డి

జ్ఞానమృతాన్ని కురిపించిన 'శ్రీ పిచ్చిమాంబ మఠం'





మైదుకూరులో పోరుమామిళ్ళ రోడ్డులో కె.సి.కెనాల్ పక్కగా వెలసిన శ్రీ సదానంద ఆశ్రమానికి మైదుకూరు ఆధ్యాత్మిక చరిత్ర విశిష్టమైన స్థానం ఉంది. "శ్రీ పిచ్చమాంబ మఠం" పేరుతోనూ "పిచ్చమ్మ మఠం" పేరుతోనూ ఈ ఆశ్రమం జనం వాడుకలో పిలువబడుతుంది.

మైదుకూరు మండలం వనిపెంటలోని ఓ మరాఠీ కుటుంబంలో జన్మించిన పెద్దయార్యులు మొదటగా శ్రీ సదానందశ్రమాన్ని స్థాపించి ప్రజల్లో తాత్విక చింతన, ఆధ్యాత్మిక భావనలు పెంపొందించ దానికి కారకులయ్యారు. తండ్రి బోధనలతో ప్రభావితమైన శ్రీ పిచ్చమాంబ ఈ ఆశ్రమం మరింతగా అభివృద్ధి చెందడానికి విశేష కృషి చేశారు. మద్రాసులోని శ్రీ పోకల శేషాచార్యుల మార్గదర్శకత్వంతో శ్రీ పిచ్చమాంబ తారక యోగిగా మార్గం నుండి శ్రీ శివరామ దీక్షితుల అచల గురుపరంపర మార్గానికి దృష్టి మరల్చారు. బృహద్వాశిష్ట సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొని, ఆ సిద్ధాంత భావనలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు 1931 జూన్ 15వ తేదీన ఆశ్రమ ట్రస్టును శ్రీపిచ్చమాంబ ఏర్పాటు చేశారు. సదానందాశ్రమంలో పూజా మందిరం భజన మందిరంలను ఏర్పాటుచేశారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మనుమరాలైన జ్ఞాన బోధ ప్రవక్త శ్రీ ఈశ్వరీ మాంబ ప్రత్యక్ష కటాక్ష ములకు పాత్రులైన కుటుంబంలో ఐదవతరం సంతానంగా జన్మించిన శ్రీ పిచ్చమాంబ, ఆశ్రమంలో అహర్నిశలూ ఆధ్యాత్మిక, తాత్విక కార్యక్రమాలనూ, ధ్యాన పూజా కార్యక్రమాలనూ నిర్వహించారు. మైదుకూరు పరిసర గ్రామాలతోపాటు జిల్లాలోని పులివెందుల, చవ్వారి పల్లె , భూమాయపల్లె, సున్నపు రాళ్ళపల్లె, పెద్దపసుపుల, సర్వాయపల్లె అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, యాడికి ప్రాంతాలనుండి గురుశిష్య పరంపర శ్రీ సదానందాశ్రమానికి తరలివచ్చి ఇక్కడి కార్యక్రమాలలో రోజుల తరబడి పాల్గొనేవారు. రాష్ట్రం నలుమూలలానుండి గురుబోధకులు తరలివచ్చి ఆశ్రమంలో శిష్యులకు బోధనలు చేసేవారు. శ్రీ పిచ్చమాంబ స్వయంగా తన శిష్యులకు, జిజ్ఞాసులకూ బోధనలు చేస్తూ, వారి తాత్విక సందేహాలను తీరుస్తూ ఉండేవారు. కార్తీక మాసంలో విశేషరీతిలో జరిగే ఆశ్రమ కార్యక్రమాల్లో భక్తులూ, శిష్యులూ అధికసంఖ్యలో పాల్గొనేవారు. శ్రీ పిచ్చమాంబ జ్ఞానామృత బోధన కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాలేదు. అనేక తాత్విక, శతక, పురాణాలను శ్రీ పిచ్చమాంబ రచించారు. శ్రీ పిచ్చమాంబ రచించిన వశ్రీ ప్రబోధచంద్రోదయం, శ్రీ వీరగురురాజ శతకం, తత్వరామాయణం, తత్వ ప్రబోధిని, అచల శతకం గ్రంధాలయాలు ఆధ్యాత్మిక లోకంలో ఎనలేని గుర్తింపును పొందాయి. ఇవేకాకుండా మరెన్నో రచనలను శ్రీ పిచ్చమాంబ చేసినప్పటికి గ్రంథ రూపంలోవెలువడకపోవడం పలువురిని విచారానికి గురిచేస్తోంది. " శ్రీ ప్రబోధ చంద్రోదయం" గ్రంథం, శ్రీకృష్ణమిశ్రీయం అనే హిందీ గ్రంథానికి అనువాద గ్రంథంగా శ్రీ పిచ్చమాంబ వెలువరించారు. అలాగే "శ్రీ వీరగురురాజ శతకం" ఆధ్యాత్మిక, విద్యా పరమార్థాలను గొప్ప వివరణాత్మక గ్రంథంగా పేరుగాంచింది. "తత్వ రామాయణం" అనే గ్రంథాన్ని పోరుమామిళ్ళ మండలం చల్లగిరిగెల గ్రామం లో వెలసిన శ్రీరామచంద్రుని దేవాలయంలో శ్రీ రామ చంద్రుని సన్నిధిలో శ్రీపిచ్చమాంబ రచించారు. మానవ దేహ తత్వానికి రామాయణం గాథను అన్వయించి రచించిన "తత్వరామాయణం" తాత్విక సాహిత్యంలో ఒక గొప్ప ప్రయోగంగా శిష్యపరంపరలో విశేష ప్రాచుర్యాన్ని పొందింది. అలాగే" తత్వ ప్రబోధిని" లో కందార్థ తత్వాలను శ్రీ పిచ్చమాంబ హృద్యమైన రీతిలో పొందుపరిచారు.

శ్రీ పిచ్చమాంబ లెక్కలేనన్ని తత్వాలను రచించి, శిష్యులకు పాడి వినిపించినప్పటికీ తన "తత్వప్రబోధిని"లో యాభై తత్వాలను మాత్రమే పొందుపరిచారు. శుభకార్యాలలో స్త్రీలు పాడుకునే పలు వేడుక పాటలను కూడా ఈ గ్రంథంలో చేర్చారు.

సదానందాశ్రమ నిర్వహణలో శ్రీ పిచ్చుమాంబకు ఆమె శిష్యులు వివేష సహకారాన్నీ, సేవలనూ అందించారు. మైదుకూరుకు చెందిన శ్రీ నంది వేంకటపతి, బ్రహ్మంగారి మఠానికి చెందిన శ్రీ అరవ వెంకటస్వామి, పిచ్చుమాంబ సోదరుడు శ్రీ గోవిందయ్య, పులివెందులకు చెందిన శ్రీ నాగదాసు, భూమాయపల్లెకు చెంది శ్రీలక్ష్మిరెడ్డి కొట్టాలపల్లెకు చెందిన శ్రీమతి గజ్జెల నారమాంబ మైదుకూరికి చెందిన శ్రీ వన్నూరు గారి పెద్ద వేంకటపతి చవ్వారిపల్లెకు చెందిన మాడిమిద్దె చెన్నమ్మ, శ్రీ పిచ్చుమాంబకు ప్రియశిష్యులుగా పేర్కొనవచ్చు. శ్రీ వెంకటస్వామి గీతామందిరం నిర్మించారు. వీరేకాకుండా శ్రీ పిచ్చుమాంబ చెల్లెలు భర్త శ్రీ రామోజీరావుగారు.

ఆశ్రమ వ్యవహారాల్లో పాల్గొని సేవలను అందించారు. పులివెందులలోని కచేరి రోడ్డులో కూడా శ్రీ పిచ్చుమాంబ మఠాన్ని శిష్యులు నిర్మించారు. సదానందాశ్రమంలో శ్రీ పిచ్చుమాంబ ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు జరగడం వల్ల కాలక్రమంలో సదానందాశ్రమానికి బదులుగా "శ్రీ పిచ్చుమాంబ మఠం" గా పేరువచ్చింది.

సుమారు 50 సంవత్సరాల క్రిందట 'హేవిళంబి' నామ సంవత్సరం చైత్రమాసం, బహుళ ద్వాదశి శుక్రవారం నాడు శ్రీ పిచ్చుమాంబ పరమపదించారు.

" జగతి జనములు మాయచే జడులుగాక
భక్తి సుజ్ఞాన సమతంబరుగుచుండి
కరుణ శాంతియు, సద్ధర్మ పరులునగుచు
వేద విజ్ఞాన సత్యముల్ విడువకుండ
భారతదేశంబు భద్రమై వరలుగాక ॥

అంటూ తన ప్రబోధ చంద్రోదయం గ్రంథానికి తాను రాసుకున్న భరతవాక్యంలో మన దేశంపట్ల, దేశంలో ప్రజల సుఖ శాంతులపట్ల అపారమైన ఆకాంక్షను శ్రీ పిచ్చుమాంబ వ్యక్తంచేశారు.

పుణ్యభూమిగా, పేదభూమిగా ప్రపంచ దేశాలలో తనకంటూ విశిష్టస్థానాన్నీ, విలక్షణ వారసత్వాన్నీ సంతరించుకున్న భారతదేశంలో ఎందరో సాధుపుంగవులూ, సాధ్వీమాతలూ, సిద్ధులూ, అవధూతలూ, అవతరించి, దేశంలో ఆధ్యాత్మిక జ్ఞాన వికాసాలకూ తమ భోధనలనూ, రచనలనూ అందించారు. శ్రీ పిచ్చుమాంబ అలాంటి మహనీయుల కోవకు చెందిన అమృత మూర్తిగా గణతికెక్కారు.

పిచ్చుమ్మ మఠంలో అందమైన పూలతోట, పండ్లతోట, మంచినీటి బావి ఉండేవి.

తాత్విక ఆలోచనాపరులకీ, శిష్యపరంపర కూ
మానసిక వికాసం కల్గించి, తన ఒడిలో చేర్చుకునిఒద తీర్చిన సదానందాశ్రమం మైదుకూరు పట్టణానికే వన్నె తెచ్చిందని చెప్పవచ్చు.

- తవ్వా ఓబుల్‌రెడ్డి



అచల గురు పరంపర చిత్రం





వెంకటపతి



వెంకటస్వామి




పిచ్చమ్మ



మైదుకూరు నియోజకవర్గంలోని శ్రీ బ్రహ్మంగారిమఠం పరిసర ప్రదేశాలన్నీ యోగిపుంగవులతో భక్తా గ్రేసరులకూ నిలయాలుగా వెలిశాయి. బ్రహ్మంగారి మఠం సమీపంలోని శ్రీ నారాయణ స్వామి మఠం ఎంతో ప్రాశస్త్యం ఉన్న ప్రదేశంగా వెలుగొందింది. 2005 మార్చి 30వ తేదీన ఏప్రిల్ 6వ తేదీవరకు చివరిసారిగా శ్రీ నారాయణస్వామి మఠంలో ఆరాధన మహోత్సవాలు జరిగాయి. తెలుగు గంగ పథకంలో భాగంగా బ్రహ్మంగారిమఠం వద్ద నిర్మించిన బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో బసవాపురం, ఓబులరాజుపల్లె, జంగంరాజుపల్లె, గొల్లపల్లె, చీకటివారిపల్లె గ్రామాలతోపాటుగా శ్రీ నారాయణస్వామి మఠం మునకకు గురైంది.

శ్రీ నారాయణస్వామి మఠం క్షేత్రానికి విశిష్టమైన చరిత్ర, ఆధ్యాత్మిక నేపథ్యం ఉంది.

కడప జిల్లా వీరపునాయుని పల్లె మండలం మిట్టపల్లె గంగిరెడ్డిపల్లె గ్రామంలో జన్మించిన శ్రీ నారాయణరెడ్డి చిన్నతనంలోనే ప్రాపంచిక వ్యవహారాలకు దూరంగా ఉంటూ అద్వైత దృష్టిని సాధించారు. ఆ మహనీయుని గొప్పతనాన్ని తెలుసుకున్న భక్తులు అధిక సంఖ్యలో ఆయనకు ఆశ్రయించారు. భక్తులకు జ్ఞానోపదేశం అందిస్తూ, స్వగ్రామంనుండి శ్రీ నారాయణరెడ్డికి దేశాటనానికి బయలుదేరారు. కర్నూలు జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆ తర్వాత కడప జిల్లా కు చేరుకుని గ్రామాలలో పర్యటిస్తూ రాతీబావి, రేకులకుంటల మీదుగా జంగంరాజుపల్లె చేరుకున్నారు. ఈ విషయం తెలుసు కున్న ఓబులరాజుపల్లె గ్రామప్రజలు జంగంరాజుపల్లె గ్రామానికి వెళ్ళి తమ గ్రామానికి రావాల్సిందిగా శ్రీ నారాయణస్వామిని ఆహ్వానించారు. స్వామి వారికి ప్రియమైన చిందు, తప్పెట్లతో ఊరేగిస్తూ ఓబుల రాజుపల్లెకు చేరుకున్నారు. గ్రామంలోని వారికి, పరిసర గ్రామాల వారికీ శ్రీ నారాయణ స్వామి జ్ఞానభోధ చేశారు. స్వామికి ఆతిధ్యం ఇచ్చిన శ్రీ బొమ్మూ వీరారెడ్డి కోర్టు కేసు నిమిత్తమై బద్వేలు వెళుతూ తనకు ఆశీస్సులు అందించాల్సిందిగా స్వామిని కోరారు. కేసు తోసిపోతుందో అని స్వామి చెప్పారు. అలాగే కేసు తోసి పోయింది. ఓబుళరాజుపల్లె కు చేరిన వారం రోజుల తర్వాత(క్రీ.శ. 1913) ఫాల్గుం బహుళ ద్వాదశినాడు శ్రీ నారాయణస్వామి తన భౌతిక



దేహాన్ని చాలించారు. ఓబుళరాజుపల్లె గ్రామానికి పడమర దిశగా కుందేలు బోతు పక్కగా నాటి గ్రామాధికారి శ్రీ బొమ్మ వీరారెడ్డి స్వామి వారికి సమాధి నిర్మించి శ్రీ నారాయణస్వామి మఠాన్ని స్థాపించారు. శ్రీ వీరారెడ్డి గారి అనంతరం, శ్రీ బొమ్మ రామారెడ్డి (మాజీ శాసనసభ్యులు) జంగంరాజుపల్లె మాజీ సర్పంచ్ శ్రీ బొమ్మ పోలిరెడ్డి గారు నారాయణస్వామి మఠంలో ప్రతిఏటా ఆరాధనోత్సవాలను నిర్వహించడానికి, ప్రతి శుక్రవారం పూజలను నిర్వహించడానికి ఇతోధికంగా కృషిచేశారు. వారి తర్వాత

శ్రీ వారి వారసులు శ్రీ బొమ్మూ చిన్న వీరారెడ్డి, వారి సోదరులు, వారి వారసులు శ్రీ నారాయణస్వామి మఠం కార్యక్రమాలను భక్తితో నిర్వహిస్తూ వచ్చారు. శ్రీ నారాయణ స్వామికీ ఓబుళరాజుపల్లె, బసవాపురం, జంగంరాజుపల్లె, రేకులకుంట, వరదాయపల్లె, గంగాయపల్లె, చిన్నయ్యగారిపల్లె పెద్ద చియ్యపాడు, తదితర ప్రాంతాల అధిక సంఖ్యలో భక్తులూ, భజన బృందాలు ఉండేవి. స్వామి వారి ఆరాధనోత్సవాల సందర్భంగా పురాణ పఠనా సప్తాహాన్ని కూడా నిర్వహించేవారు. హరికథలు, నాటక ప్రదర్శనలూ జరిగేవి. అన్నదానం, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు కూడా వైభవంగా జరుగుతూ ఉండేవి. శ్రీ నారాయణరెడ్డి స్వామి మొట్టమొదట ఓబుళరాజుపల్లెకు వచ్చిన సంధర్భంలో తాను నాలుగు రోజుల్లో పరమపదించినున్నట్లు భక్తులకు ముందుగా వెల్లడించారు. ఆయన పరమ పదించిన తర్వాత 92 ఏళ్లపా నారాయణస్వామి మఠం ఆధ్యాత్మిక వాతావరణంతో వెల్లి విరిసింది. గంగాయపల్లె, నారాయణస్వామి మఠం మీదుగా బ్రహ్మంగారిమఠంకు కడప నుండి ఆర్టీసీ బస్సులు నడిచేవి. మైదుకూరి నుండి కూడా నారాయణస్వామి మఠం బస్సు సర్వీసు సుమారు 25 ఏళ్ళపాటు నడిచింది. బ్రహ్మంగారిమఠం వెళ్ళే భక్తులకు నారాయణస్వామి మఠం ఒక మజిలీగా ఉండేది. అక్కడికి చేరుకున్న భక్తులకు అన్నదానం కార్యక్రమము నిరంతరం నిర్వహించేవారు. తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా నారాయణస్వామి మఠాన్ని మునకగా ప్రకటించడంతో ఆ మఠంలో పూజారి విధులను చాలా ఏళ్ళపాటు నిర్వహించిన భక్తురాలు సాలమ్మ తెలుగుగంగ కట్టకు వెలుపల నూతనంగా నారాయణస్వామి మఠాన్ని మరొకదానిని నిర్మించారు.

బ్రహ్మసాగర్ రిజర్వాయర్ గ్రామాలతో పాటు ఐక్యమైపోయిన. శ్రీ నారాయణస్వామి మఠం ఈ ప్రాంత భక్తులలో గొప్ప ఆధ్యాత్మిక స్మృతులను మిగిల్చింది.

– తవ్వా ఓబుల్‌రెడ్డి

